ఓవర్ లోడ్ బస్సులను నడపలేం

రెండు చోట్ల ఆర్టీసీ బస్సులను నిలిపిన డ్రైవర్లు • 'బస్సు నీ అయ్యదా? నీదా? ఎవలం దిగేది లేదు' • ఆర్టీసీ సిబ్బందిపై ప్రయాణికుల ఆగ్రహం

ములుగు జిల్లా తాడ్వాయి జాతీయ రహదారిపై బస్సును నిలిపిన డ్రైవర్

హుజూరాబాద్ టౌన్/తాడ్వాయి, ఆగస్టు 22: ఆర్టీసీ బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కడంతో.. ఓవర్ లోడ్ బస్సులను నడపలేమంటూ ఇద్దరు డ్రైవర్లు రెండుచోట్ల బస్సులను నడిరోడ్డుపైనే నిలిపారు. ఇలాగైతే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని, వెంటనే బస్సు దిగాలని ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను వేడుకున్నా వినిపించుకోలేదు. పైగా 'బస్సు నీ అయ్యదా? నీదా? ఎవలం దిగేది లేదు.. బస్సు పోనియ్యి' అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనలు గురువారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో చోటు చేసుకున్నాయి. సిరిసిల్ల బస్సు వరంగల్ వెళ్తుండగా హుజూరాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఎక్కారు. డ్రైవర్ చెప్పినా బస్సు దిగలేదు. ఓవర్ లోడ్‌తోనే బస్సును బస్టాండ్ నుంచి బయటకు తీసుకొచ్చి నడిరోడ్డుపైనే నిలిపారు. ప్రయాణికులు సహకరిస్తేనే బస్సు ముందుకు కదులుతుందని చెప్పారు. ఎట్టకేలకు ప్రయాణికులు సహకరించడంతో బస్సు ముందుకు కదిలింది. కొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు భూపాలపల్లికి వెళ్లేందుకు మధ్యాహ్నం ప్రయాణికులతో తాడ్వాయికి చేరుకుంది. అక్కడ ఒకే బస్సులో 130 మంది ప్రయాణికులు ఎక్కారు. దీంతో కండక్టర్ కొంత మంది బస్సు దిగాలని, వెనుక వచ్చే బస్సులో ఎక్కాలని సూచించారు. తన మాటను వినకుండా కొందరు మహిళలు వాగ్వాదానికి దిగారు. మహిళల మాటలకు తాళలేక డ్రైవర్ బస్సు దిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని వెళ్లేందుకు యత్నించారు. బస్సులో ఉన్న పురుష ప్రయాణికులు డ్రైవర్‌ను సముదాయించడంతో సుమారు 60 మంది ప్రయాణికులు బస్సు దిగారు. డ్రైవర్ 70 మంది ప్రయాణికులతో బస్సు భూపాలపల్లికి వెళ్లిపోయారు.

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నడిరోడ్డుపై నిలిచిపోయిన బస్సు

పెచ్చులూడిన బస్టాండ్ పైకప్పు

ముగ్గురికి గాయాలు.. దవాఖానకు తరలింపు

పెచ్చులు ఊడిన భైంసా బస్టాండ్‌లోని పైభాగం

భైంసా, ఆగస్టు 22: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పైకప్పు పెచ్చులూడి ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికురాలు శ్రీలత తన కూతురు సహస్రతో కలిసి గురువారం నందిపేట్ నుంచి కుభీర్‌కు వెళ్తున్నది. బస్టాండ్ ప్రాంగణంలో కుభీర్ ప్లాట్ ఫాం వద్ద కూర్చున్నది. వారి పక్కనే సంగీత అనే ప్రయాణికురాలు కూడా ఉన్నది. ఇంతలో బస్టాండ్‌లోని పైకప్పు పెచ్చులు ఊడి పడటంతో శ్రీలత చేయికి, తలకు గాయాలయ్యాయి. కూతురు సహస్రకు, సంగీతకు కూడా గాయాలవడంతో వెంటనే చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న డీఎం హరిప్రసాద్, ఆర్డీవో కోమల్‌రెడ్డి దవాఖానకు చేరుకుని పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట ఎస్‌బీఐ బ్యాంకులో బారులు తీరిన రైతులు

ఎవరు ముందొస్తే వారికే రుణమాఫీ

రోజుకు 30 మంది రైతులకే టోకెన్లు

నర్సింహులపేట, ఆగస్టు 22: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని ఎస్‌బీఐ పరిధిలో పంట రుణాలు తీసుకున్న రైతులు రుణమాఫీ కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. 20 రోజులపాటు ఆడిట్ పేరుతో రుణమాఫీ డబ్బులు రెన్యూవల్ చేయకపోవడంతో రైతులు బ్యాంకు వద్ద బారులు తీరారు. దీంతో రుణమాఫీ రెన్యూవల్‌కు సంబంధించి గురువారం ఉదయం 30 మంది మాత్రమే బ్యాంక్ అధికారులు టోకెన్లు ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 30 మందికి మాత్రమే రెన్యూవల్ చేస్తే ఇంత మందికి ఎన్ని రోజుల్లో చేస్తారు? బ్యాంకు చుట్టూ ఎన్ని రోజులు తిరగాలి? అని ఆవేదన చెందుతున్నారు. ఎస్‌బీఐ పరిధిలో సుమారు 2800 మంది రుణం తీసుకుంటే 1200 మందికి మాత్రమే రుణమాఫీ అయిందని అధికారులు చెప్తున్నారు.

బ్యాంకు వద్ద చెప్పులతో క్యూలైన్

మాఫీ అయిందో లేదో తెలుసుకునేందుకు రాక

నెల్లికుదురు ఎస్‌బీఐ వద్ద బారులు తీరిన రైతులు

నెల్లికుదురు ఎస్‌బీఐ వద్ద క్యూలైన్‌లో చెప్పులు ఉంచిన రైతులు

నెల్లికుదురు, ఆగస్టు 22: పదేండ్ల క్రితం ఎరువులు, విత్తనాల కోసం రైతులు తెల్లవారుజామునే షాపుల ఎదుట చెప్పులు వదిలి క్యూలైన్ కట్టేవారు. ఇప్పుడు అవే పరిస్థితులు వచ్చాయి. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎస్‌బీఐ వద్ద గురువారం రుణ మాఫీ కోసం రైతులు క్యూలో చెప్పులు పెట్టి ఉదయం 7 గంటల నుంచి అధికారుల కోసం ఎదురుచూశారు. వారు వచ్చాక రైతులు బారులు తీరి రుణ మాఫీ విషయం తెలుసుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. రోజూ బ్యాంకుకు వస్తున్నా ఫలితం మాత్రం లేదని రైతులు చెబుతున్నారు. బ్యాంకు అధికారులు గ్రామాల వారీగా తేదీలు ప్రకటించకపోవడంతో మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఒకేసారి వచ్చి బ్యాంకు ముందు బారులుదీరారు.

కవితకు అస్వస్థత ఎయిమ్స్‌లో పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానం కేసులో తీహార్ జైలులో కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అస్వస్థతకు గురయ్యారు. ఆమె కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో ఇబ్బందిపడుతున్నారు. దీంతోపాటు ఆమెకు పలు గైనిక్ సంబంధమైన సమస్యలు తలెత్తినట్టు సమాచారం. తీహార్ జైలు అధికారులు గురువారం ఆమెను ఎయిమ్స్‌కు తీసుకువచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నివేదికలను ఎయిమ్స్ వైద్యులు జైలు అధికారులకు పంపించారు.

ఇంజినీరింగ్ విద్యార్థి దారుణ హత్య

బాలాపూర్‌లో పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

బడంగ్‌పేట, ఆగస్టు 22: రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి దారుణహత్యకు గురయ్యాడు. స్థానిక గణేశ్ చౌక్ చౌరస్తా సమీపంలోని మండి@37 రెస్టారెంట్ వద్ద గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో మోండ్రు ప్రశాంత్ (21)ను కత్తులతో దాడి చేసి చంపేశారు. మృతుడు నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండో సంవత్సరం మధ్యలోనే ఆపేశాడు. గురువారం రెస్టారెంట్ ముందు పాన్‌షాపు వద్ద ఉండగా, నలుగురు వ్యక్తులు వచ్చారని, వారిలో ఒక వ్యక్తి కత్తితో ప్రశాంత్‌ను పొడిచారని పోలీసులు తెలిపారు. సిగరెట్ తీసుకొనే దగ్గర గొడవ జరిగిందని డీసీపీ సునీతా రెడ్డి వెల్లడించారు. కాగా, ప్రశాంత్ హత్యపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్ఎస్‌యూఐ ఎన్నికల నేపథ్యంలోనే విభేదాలు వచ్చి హత్య జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎన్ఎస్‌యూఐ ఎన్నికల ప్రచారంలోనూ ప్రశాంత్ పాల్గొన్నట్టు తెలిపారు. నిందితులు గంజాయి మత్తులో ఊగుతారని పేర్కొన్నారు. కాగా, నిందితులు కాంగ్రెస్ నేతలను ఆశ్రయించినట్టు సమాచారం.

రాత్రివేళ మహిళలకు ఉచిత ప్రయాణం అబద్ధం

ఎమర్జెన్సీ నంబర్ మాది కాదు..లూధియానా పోలీసులది

సోషల్ మీడియాలో ప్రచారంపై తెలంగాణ పోలీసుల వివరణ

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రాత్రివేళల్లో మహిళలు పోలీసులకు ఫోన్‌చేస్తే ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తారంటూ రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న వార్త బూటకమని తేలింది. ఇది తమపై జరుగుతున్న దుష్ప్రచారమని తెలంగాణ పోలీసులు ఖండించారు. ఎలాంటి ఎమర్జెన్సీ అయినా బాధితులు 100 నంబర్‌కు మాత్రమే ఫోన్ చేయాలని స్పష్టం చేశారు. 'రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య అత్యవసర పరిస్థితి ఉన్న మహిళలు 1091 లేదా 7837018555 నంబర్లకు ఫోన్ చేస్తే.. స్థానిక పోలీసు వాహనం వచ్చిన మిమ్మల్ని సురక్షితంగా ఇంటి వద్ద దించుతుంది' అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. స్పందించిన పోలీస్ శాఖ 7837018555 నంబర్ తమది కాదని, అది పంజాబ్‌లోని లూధియానా పోలీసులకు సంబంధించిందని మిగతా రాష్ట్రాల పోలీసులకు దానితో సంబంధం లేదన్నారు. తెలంగాణ పోలీసులకు సంబంధం లేని విషయాలను వైరల్ చేసి ప్రజలను అయోమయానికి గురిచేయవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే డయల్ 100కి కాల్ చేయాలని సూచించారు.

జన్నారం ఎస్‌బీఐ మేనేజర్ మహేశ్‌తో రైతుల వాగ్వాదం

డబ్బులిస్తేనే రుణమాఫీ చేస్తా

• ఎస్‌బీఐ కాంట్రాక్ట్ ఉద్యోగి డిమాండ్

జన్నారం, ఆగస్టు 22: రుణం మాఫీ చేసేందుకు ఎస్‌బీఐ కాంట్రాక్ట్ ఉద్యోగి లంచం డిమాండ్ చేసిన ఘటన గురువారం మంచిర్యాల జిల్లా జన్నారంలో జరిగింది. హాస్టల్ తండాకు చెందిన మ్యాక ఎర్రయ్యకు రూ.1.5 లక్షల రుణమాఫీ అయినట్టు జాబితాలో వచ్చింది. అయితే, రూ.20 వేల లంచం ఇస్తేనే మాఫీ చేస్తామని బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి పరంకుస సాయిరామ్ స్పష్టంచేశాడు. దీంతో గురువారం మధ్యాహ్నం రైతు ఎర్రయ్య ఆ ఉద్యోగికి రూ.15 వేలు ఇచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న రైతులు బ్యాంక్ వద్దకు చేరుకొని మేనేజర్ మహేశ్‌తో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సాయిరామ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జనవరి నుంచి సన్న బియ్యం

మొదటిపేజీ తరువాయి...

గురువారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి విజిలెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీఎస్ బియ్యం దారి తప్పితే చర్యలు కఠినంగా ఉంటాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. పట్టుబడితే తక్షణమే డీలర్‌షిప్ రద్దు చేస్తామని తెలిపారు. రేషన్ డీలర్ల ఆదాయం పెంపు దిశగా అడుగులు వేస్తున్నామని, వారి న్యాయమైన డి మాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 1,629 రేషన్ డీలర్ల భర్తీ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కార్యదర్శి డీఎస్ చవాన్ ఇతర 8 శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లోగా నెల్లికల్లు లిఫ్ట్ భూసేకరణ

నెల్లికల్లు ఎత్తిపోతల పథకం భూసేకరణ పనులను ఏప్రిల్ మాసాంతానికి పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతికి భూసేకరణ అడ్డుకావద్దని, రైతులతో త్వరితగతిన సంప్రదింపులు జరపాలని సూచించారు. నెల్లికల్లు లిఫ్ట్ పనులపై ఈఎన్సీ అనిల్‌కుమార్, నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి, సీఈ అజయ్‌కుమార్‌తో సచివాలయంలో గురువారం జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. అటవీశాఖ భూములకు అదనంగా చెల్లించాల్సిన నిధుల ప్రతిపాదనలను రూపొందించాని, పెండింగ్‌లో ఉన్న 23 కోట్ల విద్యుత్తు బకాయిలతో పాటు పెరిగిన బకాయిల ప్రతిపాదనలు తక్షణమే పంపాలని తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో కొత్తగా నిర్మించతలపెట్టిన చెక్ డ్యామ్ నిర్మాణానికి పాలనా పరమైన అనుమతులు తీసుకోవడంతోపాటు 5 చెక్ డ్యామ్‌లకు తక్షణమే టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి పాల్గొన్నారు.

..25న కోర్టుకు రండి

మొదటిపేజీ తరువాయి..

దాఖలు చేసిన పరువు నష్టం దావాను కోర్టు విచారణకు స్వీకరించింది. సెక్షన్ 499 ఐపీసీ, 125 పీపుల్స్ రెప్రెజెంటేషన్ చట్టం కింద రేవంత్‌పై పరువునష్టం దావా నమోదైంది. విచారణ సందర్భంగా.. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఉత్తర్‌ప్రదేశ్ కేసులో 125 ప్రజాప్రాతినిధ్యం చట్టం గురించి కోర్టు వివరించిందని, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోట్‌పై గజేంద్రసింగ్‌షెకావత్ దాఖలు చేసిన కేసులో సమన్లు జారీచేయడాన్ని ఫిర్యాదుదారుడు ప్రస్తావించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారి

గోడదూకి.. 4 కిలోమీటర్లు నడిచి..

• ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని పోలీసులకు విద్యార్థుల ఫిర్యాదు
• వెంటనే విచారణకు ఆదేశించిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ప్రిన్సిపాల్ వేధింపులకు గురిచేస్తున్నారని, ఆమె నుంచి రక్షించాలంటూ ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. జైనథ్ మండలానికి చెందిన బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఆదిలాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్న మావలలో తాత్కాలిక భవనంలో కొనసాగుతున్నది. ఇందులో పదో తరగతి చదువుకుంటున్న 46 మంది విద్యార్థులు ఉదయం 3గంటల సమయంలో స్కూల్ గోడదూకి 4కిలోమీటర్ల దూరం నడిచి ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు ఇటీవల ఈ పాఠశాల ప్రిన్సిపాల్ గంగన్న బదిలీపై వెళ్లగా.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట నుంచి సంగీత ఇక్కడికి వచ్చారని, పాఠశాలలో భోజనం, కరెంటు, ఇతర సమస్యలు పరిష్కరించాలని అడిగితే ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని, టీసీలు ఇస్తూ, బ్యాడ్ కండక్ట్ అని తమ సర్టిఫికెట్లపై రాస్తా అంటూ బెదిరిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. వేధింపులు భరించలేక ఐదుగురు పిల్లలు ఆత్మహత్య ఆలోచన చేసినట్టు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు 4 గంటలు పోలీస్‌స్టేషన్‌లో ఉండగా.. పోలీసులు కలెక్టర్, ఎస్పీకి సమాచారం ఇచ్చారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు విద్యార్థులకు నచ్చజెప్పి వారికి టిఫిన్ పెట్టించి బస్సుల్లో స్కూల్‌కు పంపించారు.

నాడు పశువుల కాపరి.. నేడు పీహెచ్‌డీ హోల్డర్

జాగ్రఫీలో పీహెచ్‌డీ అందుకున్న కత్తి వీరయ్య

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : నిరుపేద కుటుంబంలో పుట్టి పశువుల కాపరిగా మారిన ఓ యువకుడు, అనంతరం పట్టుదలతో చదివి పీహెచ్‌డీ పట్టా సాధించాడు. అతనే సూర్యాపేట జిల్లా మునగాల మండలం విజయరాఘవపురం(రామసముద్రం)గ్రామానికి చెందిన కత్తి వీరయ్య. ఉస్మానియా యూనివర్సిటీ జాగ్రఫీ డిపార్ట్‌మెంట్ నుంచి ప్రొఫెసర్ లక్ష్మయ్య గైడెన్స్‌లో 'అప్లికేషన్ ఆఫ్ జీఐఎస్ అర్బన్‌ల్యాండ్ యూజ్ చేంజెస్ ఇన్ సూర్యాపేట మున్సిపల్ ఏరియా నల్లగొండ డిస్ట్రిక్ట్' అనే అంశంపై వీరయ్య పీహెచ్‌డీ పొందారు. తన పాఠశాల విద్యను నేరుగా మూడో తరగతి నుంచి ప్రారంభించానని, నాటి నుంచి నేటి వరకు చదువుతూనే ఉద్యమాల్లో పాల్గొంటూ.. అంబేద్కర్ చెప్పినట్టు మనం ఏ సమాజం నుంచి వచ్చామో ఆ సమాజం అభివృద్ధి కోసం పాటుపడాలనే భావనతో జీవితంలో కష్టాలను ఎదుర్కొంటూ పీహెచ్‌డీ సాధించినట్టు వీరయ్య తెలిపారు.

మంద కృష్ణ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

• ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి

ఖైరతాబాద్, ఆగస్టు 22 : మాలలు మనువాదులు అంటూ వ్యాఖ్యానించిన ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి కో కన్వీనర్లు జీ చెన్నయ్య, చెరుకు రాంచందర్ మాట్లాడుతూ.. మంద కృష్ణ వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. మాలలు ఎప్పటికీ అంబేద్కరిస్టులేనని పేర్కొన్నారు. నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మనువాద పార్టీ బీజేపీతో మంద కృష్ణ పొత్తు పెట్టుకున్నట్టు ఆరోపించారు.

అకారణంగా నిర్బంధం

రుణమాఫీపై నిరసనలు పూర్తయ్యాక అదుపులోకి..

చొప్పదండిలో గురువారం రాత్రి కొనసాగిన అరెస్టులు

కరీంనగర్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చొప్పదండి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. దహనం చేస్తున్న సందర్భంలో పోలీసులు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఎక్కడి వాళ్లు అక్కడికి వెళ్లిపోయాక ఇదేరోజు రాత్రి ఒక్కో నాయకున్ని పోలీసులు అరెస్టు చేశారు. ఏనుగు రవీందర్‌రెడ్డిని ఇదే రోజు రాత్రి కరీంనగర్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. చొప్పదండి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి శేఖర్‌ను కూడా పోలీసులే అరెస్టు చేసి ఉంటారని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ గన్ను శ్రీనివాస్‌రెడ్డిని కూడా చొప్పదండి పోలీసులు గురువారం రాత్రే అరెస్టు చేశారు. నిరసన కార్యక్రమాలు ముగిసిన తర్వాత బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని వదిలేశారని, మళ్లీ రాత్రి పూట ఎందుకు అరెస్ట్ చేయాల్సి వచ్చిందని, దీని వెనక కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి ఉన్నదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టంచేస్తున్నారు. మల్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొరండ్ల నరేందర్‌రెడ్డిని గంటన్నర పాటు స్టేషన్‌లో నిర్బంధించారు.

చొప్పదండి ఠాణా వద్ద మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

వర్చువల్‌గా వలంటీర్ల శిక్షణను ప్రారంభించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

కమ్యూనిటీ మీడియేటర్లకు శిక్షణ

• వర్చువల్‌గా ప్రారంభించిన సీజే

హైదరాబాద్, ఆగస్టు 22, (నమస్తే తెలంగాణ): ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను ప్రోత్సహించే నిమిత్తం కమ్యూనిటీ మీడియేటర్ వలంటీర్లకు శిక్షణ తరగతులను గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే హైకోర్టు నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాల ప్రోత్సాహానికి న్యాయ సేవాధికార సంస్థ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, నిజామాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో మూడ్రోజులపాటు శిక్షణ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయాపాల్, జస్టిస్ కే సురేందర్, జస్టిస్ జే శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఆలయ గోదాంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

రాజన్న ఆలయంలో ఏసీబీ సోదాలు

వేములవాడ టౌన్/మన్సూరాబాద్, ఆగస్టు 22: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా సోదాలు చేపట్టారు. రాజన్న ఆలయంలోని ప్రధాన విభాగాల్లో కొద్ది రోజులుగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఏసీబీ రేంజ్ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో తూనికలు, కొలతలు, ఆడిట్ శాఖలకు చెందిన అధికారులు వివిధ అంశాలపై సమగ్ర విచారణ చేపట్టారు. పలు విభాగాల్లో తనిఖీలు చేశారు. గోదాం విభాగంతోపాటు లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీలో వినియోగిస్తున్న సరుకుల శాంపిళ్లను తీసుకున్నారు.

విద్యుత్తు లైన్ల మార్పునకు 18 వేల లంచం

వెంచర్‌లో అడ్డుగా ఉన్న విద్యుత్తు లైన్లను తొలగించి నూతనంగా ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేసేందుకు లంచం తీసుకుంటూ విద్యుత్తు శాఖ టెక్నికల్ డీఈ ఏసీబీ అధికారులకు చిక్కారు. గురువారం రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆగపల్లి గ్రామ పరిధిలో ఓ వ్యక్తి రెండు ఎకరాల స్థలంలో వెంచర్ చేస్తున్నాడు. ఆ వెంచర్‌లో నుంచి 33కేవీ, 11కేవీ విద్యుత్తు లైన్లు ఉన్నాయి. వాటిని తొలగించడంతోపాటు హై ఓల్టేజీ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం వెంచర్ నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. ఆ ఫైల్ సరూర్‌నగర్ సర్కిల్ టెక్నికల్ డీఈ టీ రామ్మోహన్ వద్దకు చేరింది. వెంచర్‌లోని విద్యుత్తు లైన్ల షిఫ్టింగ్‌కు రూ.10 వేలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.8 వేలు లంచం డిమాండ్ చేశారు.

ఓటరు నమోదుకు అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ) : భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తప్పొప్పులను సవరించుకునే వీలు కల్పిస్తున్నది. వచ్చే ఏడాది జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1నాటికి 18 ఏండ్లు పూర్తయ్యేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, వచ్చే జనవరి 1న 18 ఏండ్లు నిండేవారి పేర్లను ఈసారి సవరణ జాబితాలో నమోదు చేయనున్నారు.

ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ వివరాలు..

- **దరఖాస్తుల స్వీకరణ:** అక్టోబర్ 18 వరకు
- **ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల:** అక్టోబర్ 29
- **అభ్యంతరాల స్వీకరణ:** అక్టోబర్ 29–నవంబర్ 28వరకు
- **అభ్యంతరాల పరిష్కారం:** డిసెంబర్ 24
- **ఓటర్ల తుది జాబితా విడుదల:** జనవరి 6, 2025

తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేని వర్షాలు

మరో 5రోజులపాటు వానలు

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : తెలుగు రాష్ట్రాల్లో మరో 5 రోజులపాటు వర్షాలు కురువనున్నట్టు వాతావరణశాఖ వెల్లడించింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. తెలంగాణలో మంచిర్యాల, నిర్మల్, సిరిసిల్ల, కుమ్రంభీం ఆసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, నిజామాబాద్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. గడిచిన 24గంటల్లో వనపర్తి జిల్లా రేవెల్లిలో అత్యధికంగా 9.65సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది.